Namasthe Telangana    Dt-01/07/15



# ఇక రోడ్‌క్రాస్ ఈజీ..

- ఫుట్ ఓవర్ బ్రిడ్జిలుగా మెట్రో స్టేషన్లు
- 64 ప్రాంతాల్లో సిద్ధం
- నాన్‌పేయిడ్ ఏరియా ద్వారా రోడ్డు దాటే అవకాశం
- ప్రయాణికులు కాని వారికీ స్టేషన్‌లోకి ప్రవేశం
- అడ్డగించబోమంటున్న ఎల్ అండ్ టీ

నమస్తే తెలంగాణ, సిటీబ్యూరో : నగరంలో 64 ఫుట్ ఓవర్ బ్రిడ్జిలా.. ఇదేంటి.. ప్రభుత్వం ప్రకటించకుండానే.. టెండర్లు పిలవకుండానే.. నిర్మాణం పూర్తికాకుండానే..ఎక్కడి నుంచి వచ్చాయనుకుంటున్నారా.. ?అవును వింటున్నది నిజమే.. కొత్తగా ఫుట్ ఓవర్ బ్రిడ్జిలను నిర్మించకపోయినా.. మెట్రోరైల్ స్టేషన్లను ఫుట్‌ఓవర్ బ్రిడ్జిలుగా వాడుకోవచ్చు.. పాదచారులు రోడ్డు దాటడానికి వినియోగించుకోవచ్చు. ఇందు కోసం ఎలాంటి చార్జీలను చెల్లించాల్సిన అవసరం లేదు. నాన్‌పేయిడ్ ఏరియా ద్వారా రోడ్డును దాటే అవకాశాన్ని కల్పిస్తున్నాయి మెట్రోరైల్ వర్గాలు. ప్రయాణికులు కాని వారికి సైతం స్టేషన్‌లో ప్రవేశించే అవకాశం ఉంటుందని.. అలాంటి వారిని తాము అడ్డంగించబోమని..ఎల్అండ్‌టీ వర్గాలు సైతం అంటున్నాయి. మొత్తంగా 64 ప్రాంతాల్లో కొత్తగా ఫుట్ ఓవర్ బ్రిడ్జిలు నిర్మించాల్సిన అవసరం లేదన్నమాట.. ఒక్క మెట్రో నగరంలో చాలా సమస్యలకు పరిష్కారం చూపడం గమనార్హం.

### రోడ్డు దాటాలంటే కష్టమే..

ప్రస్తుతం ప్రయాణిస్తున్న వాహనాలను దాటుకుని రోడ్డు దాటాలంటే కష్టమే. జీబ్రా క్రాసింగ్‌లున్నా... వేగంగా వచ్చే వాహనాల తాకిడితో ఇబ్బందులే. సిగ్నల్‌పడ్డప్పుడో.. వాహనాలు నిలిచినప్పుడే తప్ప..రోడ్డు దాటాలంటే గగనమే. రోడ్డు దాటేసమయంలో ప్రమాదానికి గురైన పాదచారుల గురించి ప్రత్యేకంగా చెప్పుకోవాల్సిందే. కాని మెట్రో స్టేషన్లను ఫుట్‌ఓవర్ బ్రిడ్జిలుగా వాడుకునే వీలుండటంతో.. పాదచారులకు ఉపశమనం కలగనుంది. రోడ్డు ప్రమాదాల బెడద తప్పనుంది. స్టేషన్ల నిర్వహణను చూస్తున్న ఎల్‌అండ్‌టీ సైతం పేయిడ్ ఏరియాలో ప్రవేశించే వారినే తాము ప్రయాణికులుగా పరిగణిస్తామని.. మిగతా వారు స్వేచ్ఛగా రోడ్డు దాటవచ్చని ప్రకటిస్తోంది.

### రెండు వైపుల నుంచి..

మెట్రోరైల్ ప్రాజెక్ట్‌లో మొత్తం 72 కిలోమీటర్ల వ్యవధిలో 64 స్టేషన్లను నిర్మిస్తున్నారు. 140 మీటర్లున్న స్టేషన్‌కు రెండు వైపులా.. ఎంట్రీ, ఎగ్జిట్ కోసం ప్రత్యేక ఏర్పాట్లుంటాయి. ఎస్కలేటర్లు, లిఫ్టులు, మెట్లమార్గం ద్వారా నాన్ పేయిడ్ ఏరియాలోకి ప్రవేశించవచ్చు. ఆటోమెటిక్ ఫేయిర్ కలెక్షన్ గేట్లు (ఏఎఫ్‌సీ) దాటితేనే పేయిడ్ ఏరియాలోకి ప్రవేశించినట్లువుతుంది. అక్కడి నుంచి రోడ్డు కిరువైపులా ఉన్న ఎస్కలేటర్లు, లిఫ్టులు, మెట్లమార్గం రోడ్డును దాటవచ్చు. గంటకు 8 వేల మంది వీటి ద్వారా రోడ్డుదాటడానికి ఆస్కారముంటుంది.



### స్టేషన్లు ఇవే..

**కారిడార్ -1**

మియాపూర్, జేఎన్‌టీయూ, కేపీహెచ్‌బీకాలనీ, కూకట్‌పల్లి, బాలానగర్, మూసాపేట, భరత్‌నగర్, ఎర్రగడ్డ, ఈఎస్‌ఐ హాస్పిటల్, ఎస్ఆర్‌నగర్, అమీర్‌పేట, పంజాగుట్ట, ఎర్రమంజిల్, ఖైరతాబాద్, లక్డీకాపూల్, అసెంబ్లీ ( ఇక్కడ అసెంబ్లీ వెనుక నుంచి అలైన్‌మెంట్ మారడంతో పబ్లిక్ గార్డెన్స్ లేదంటే.. జూబ్లీహాల్ వద్ద స్టేషన్ నిర్మించే యోచన చేస్తున్నారు) నాంపల్లి, గాంధీభవన్, ఉస్మానియా మెడికల్ కళాశాల, మలక్‌పేట, న్యూమలక్‌పేట, మూసారాంబాగ్, దిల్‌సుఖ్‌నగర్, చైతన్యపురి, విక్టోరియా మెమోరియల్, ఎల్బీనగర్.

**కారిడార్ -2**

జేబీఎస్, పరేడ్‌గ్రౌండ్స్, సికింద్రాబాద్ రైల్వే స్టేషన్, గాంధీ హాస్పిటల్, ముషీరాబాద్, ఆర్‌టీసీ క్రాస్‌రోడ్, చిక్కడపల్లి, నారాయణగూడ, సుల్తాన్‌బజార్,ఎంజీబీఎస్, సాలార్‌జంగ్ మ్యూజియం, చార్మినార్, శాలిబండ, షంషేర్‌గంజ్, ఫలక్‌నుమా. (ఇక్కడ అలైన్‌మెంట్ మారితే సుల్తాన్‌బజార్ నుంచి ఫలక్‌నుమా వరకు ఒక్క ఎంజీబీఎస్ స్టేషన్ తప్ప మిగతా స్టేషన్ల పేర్లు మారే అవకాశం ఉంది)

**కారిడార్ -3**

రాయదుర్గం, హైటెక్‌సిటీ, దుర్గంచెరువు, మాదాపూర్, పెద్దమ్మగుడి, జూబ్లీహిల్స్ చెక్‌పోస్ట్, జూబ్లీహిల్స్ రోడ్ నెం.5, యూసుఫ్‌గూడ, మధురానగర్, అమీర్‌పేట, బేగంపేట, ప్రకాశ్‌నగర్, రసూల్‌పుర, ప్యారడైజ్, సికింద్రాబాద్, మెట్టుగూడ, తార్నాక, హబ్సీగూడ, ఎన్‌జీఆర్ఐ, సర్వే ఆఫ్ ఇండియా, ఉప్పల్, నాగోలు.